



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

నవమి వేడుకలకు వేళాయే

● ఆలయాలకు నూతన శోభ ● సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



రామతీర్థంలో సీతారాముల విగ్రహాలు



రామతీర్థం దేవస్థానంలో కల్యాణ వేదికను సిద్ధం చేసిన దృశ్యం

విజయనగరం/నెల్లిమర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకలకు జిల్లాలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, గజపతినగరం, సంతకవిటి, రాజాం, గంట్యాడ, ఎస్‌కోట, జామి, వేపాడ తదితర మండలాల్లోని రామాలయాల్లో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణోత్సవం కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లిమర్లలోని రామతీర్థంలో రాములోరి కల్యాణాన్ని దేవదాయ శాఖ అధికారికంగా నిర్వహిస్తోంది. దేవస్థానం వెనుక ఉన్న ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం జరగనుంది. కల్యాణం తిలకించేందుకు వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో వారి కోసం వేదిక చుట్టూ టెంట్ హౌస్‌లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు.

పూర్తి వివరాలు 6లో..

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగించాలి

● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ ఫలాలు అనుభవించి ఉన్నత స్థాయికి చేరిన బడుగు వర్గాలకు చెందిన అధికారులు, ఉద్యోగులంతా తమ తోటి పేద కుటుంబాలకు చేయూత అందించాలని కోరారు. అదే జగ్జీవన్‌రామ్‌కు మనమిచ్చే గొప్ప నివాళి అని పేర్కొన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని, విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి విద్యతో ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని, జేసీ సేతు మాధవన్, దళిత బహుజన శ్రామిక యూనియన్ అధ్యక్షుడు చిట్టిబాబు, బీఎస్పీ నాయకుడు సోములు తదితరులు పాల్గొన్నారు.

● యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడు
● తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు
● శివరాంలో ఘటన
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు అఖిల

స్నేహం చెడిందని..

గరివిడి/విజయనగరంక్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్నేహం చెడిపోయిందని ఓ యువతిపై యువకుడు కత్తితో దాడిచేసిన ఘటన గరివిడి మండలం శివరాం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోండ్రు అఖిల (18) అనే యువతి శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటిలో ఉన్న గిన్నెలు కడుగుదామని పెరట్లోకి వెళ్లింది. అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న అదే గ్రామానికి చెందిన బూర్లె ఆదినారాయణ అనే యువకుడు కత్తితో దాడి చేశాడు. అఖిల కడుపుపై రెండుచోట్ల పొడిచి పరారయ్యాడు. తనను ఎవరూ పోల్చకుండా ఆదినారాయణ ముఖానికి మంకీ క్యాపు ధరించాడు. తీవ్రంగా గాయపడిన అఖిల పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు పరుగెత్తుకొని వచ్చి ఆమెను 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సమయంలో అఖిల అమ్మా, అమ్మా అంటూ రోదిస్తున్న తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది. చీపురుపల్లిలో ప్రాథమిక వైద్యం అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ వకుల్ జిందాల్, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, గరివిడి ఎస్ఐ లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

అఖిల చీపురుపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదివి మధ్యలో ఆపేసింది. ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటోంది. తండ్రి తోటనాయుడు, తల్లి సత్యవమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బూర్లె ఆదినారాయణ, అఖిల స్నేహంగా ఉండేవారు. కొన్నిరోజుల కిందట వీరి స్నేహం చెడిపోయింది. దీంతో అఖిలపై ఆదినారాయణ కోపం పెంచుకున్నాడు. దీంతో శనివారం ఉదయం పెరట్లో అఖిల ఇంటిపనులు చేస్తున్నట్లు ఆదినారాయణ గమనించాడు. మంకీ క్యాపు ధరించి ఆమెపై కత్తితో దాడి చేశాడు. ఈ సమయంలో వారి మధ్య జరిగిన పెనుగులాటలో మంకీ క్యాపు ఊడిపోవడంతో ఆదినారాయణ పరారయ్యాడు. సంఘటనా స్థలానికి పోలీసులు వచ్చినప్పటికీ కూడా తనకు ఏమీ తెలియనట్లుగా ఆదినారాయణ జనసందోహంలో కలిసిపోయాడు. పోలీసులు ఏ విధంగా దర్యాప్తు చేస్తున్నది గ్రహించాడు. అయితే, ఆస్పత్రిలో అఖిల చెప్పిన వివరాల మేరకు ఆదినారాయణతో పాటు మరో ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, త్వరలో నిందితులను అరెస్టు చేసి వారికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ తదితరులు

ఐదేళ్ల బాలికపై అత్యాచారం..

లక్కవరపుకోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై అదే గ్రామానికి 15ఏళ్ల బాలుడు శనివారం అత్యాచారం చేశాడు. వేర్వేరు వీధుల్లో ఉండే బాలిక, బాలుడి కుటుంబాలు స్నేహంగా ఉంటాయి. బాలుడు నిత్యం బాలిక ఇంటికి వస్తుంటాడు. శనివారం ఉదయం కూడా బాలుడు ఆ బాలిక ఇంటికి వెళ్లగా చిన్నారి టీవీ చూస్తూ కనిపించింది. ఇంట్లో తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కూలి పనుల నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక ఏడుస్తూ కనిపించింది. ఏమైందని అడిగితే జరిగిన విషయం చెప్పింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సీఐ ఎల్.అప్పలనాయుడు విచారణ చేపట్టారు. బాలికను ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు ఎస్ఐ నవీన్‌పడాల్ చెప్పారు. తహసీల్దార్ ప్రసాదరావు స్థానిక పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీవో కీర్తి సీహెచ్‌సీకి వెళ్లి బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. బాలుడిపై అత్యాచార, పోక్సో కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ చెప్పారు. నిందితుడిని జువైనల్ కోర్టుకు తరలిస్తామని పేర్కొన్నారు.



నేరాలు.. ఘోరాలు

● లక్కవరపుకోట మండలంలోని ఓ గ్రామంలో శనివారం నాలుగేళ్ల చిన్నారిపై 15 సంవత్సరాల బాలుడు అఘాయిత్యం చేశాడు. మాయ మాటలు చెప్పి లైంగిక దాడి చేశాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెనువెంటనే ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● గరివిడి మండలం శివరాం గ్రామంలో శనివారం అఖిల అనే యువతిపై గుర్తు తెలియని యువకుడు దాడిచేశాడు. ఇంటి వద్ద గిన్నెలు కడుగుతున్న ఆమెను మాస్కు ధరించి వచ్చిన యువకుడు కత్తితో పొడిచాడు. అఖిల అక్కడే కుప్పకూలిపోయింది. ఆగంతుకుడు పారిపోయాడు. కుటుంబసభ్యులు వెనువెంటనే విజయనగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

● నాలుగు రోజుల కిందట ప్రేమోన్మాది దాడిలో జిల్లాకు చెందిన లక్ష్మి అనే మహిళ మృతిచెందింది. రేగిడి ఆమదాలవలస మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబం విశాఖలోని కొమ్మాదిలో నివాసముంటోంది. ఆ కుటుంబానికి చెందిన యువతిని వీరఘట్టంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. అయితే వారి వివాహానికి యువతి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో పగ పెంచుకున్నాడు. ఇంట్లోకి వెళ్లి తల్లీ కుమార్తెలపై విచక్షణారహితంగా కత్తితో దాడిచేశాడు. ఘటనాస్థలంలోనే తల్లి మృతిచెందింది. కుమార్తె కొన ఊపిరితో ఉండగా స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు.

● జిల్లాలో ఒకే రోజు రెండు ఘటనలు
● ఉలిక్కిపడిన పోలీసు శాఖ
● క్షణికావేశంతో పెరుగుతున్న నేర సంస్కృతి

విజయనగరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోజుల వ్యవధిలోనే జిల్లాలో ఇటువంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. పోలీసు శాఖ ఉలిక్కిపడడంతో పాటు ఆ శాఖకు సవాల్ విసిరినట్టు అయ్యింది. ఇటువంటి ఉన్మాద చర్యల నియంత్రణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. ప్రేమించిన అమ్మాయి దక్కలేదనో, సినిమాలు, ఇతర మాధ్యమాల ప్రభావమో తెలియదు కానీ.. ఎక్కువ మంది నేర సంస్కృతిని అలవాటు చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు నేరాలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి ఘటనలతో నిండు ప్రాణాలు పోతుండగా.. కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. అటు చిన్న వయసులోనే జైలు జీవితం అనుభవించి నిండు జీవితాలను ఇబ్బందుల్లో నెట్టుకుంటున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపి వారికి ఎన్ని మార్కులు వస్తున్నాయని చూడడమే తప్ప.. వారిలో మానవతా విలువలు ఎంతవరకూ ఉన్నాయని తల్లిదండ్రులు గ్రహించలేక పోతున్నారు. పుట్టుకతోనే వారు నేర మనస్తత్వంతో ఉన్నవారు కాదు. కుటుంబ పరిస్థితులు, చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావంతోనే కొందరు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొందరు మద్యం మత్తు, ఆపై అవమానం వంటి (మిగతా 8వ పేజీలో..)



బాబోయ్ కుక్కలు

● జిల్లా వ్యాప్తంగా స్వైరవిహారం
● దాడిలో గాయపడుతున్న ప్రజలు
● ఏ ఆస్పత్రిలో చూసినా బాధితులే

● రాజాం బస్టాండ్ సమీపంలో ప్రతిరోజూ కుక్కల గుంపు హల్‌చల్ చేస్తోంది. దాదాపు పది కుక్కలు అటుగా వచ్చేవారిని బెదిరిస్తాయి. పొరపాటున ఎవరైనా భయంతో పరుగులుతీస్తే మాత్రం వెంటపడి మరీ దాడిచేస్తాయి. దీంతో ఉదయం సాయంత్రం వేళలో బస్టాండ్‌కు వచ్చే విద్యార్థులు భయపడుతున్నారు. రాజాం సామాజిక ఆస్పత్రికి ప్రతినెలా 120 నుంచి 140 వరకూ కుక్కకాటు బాధితులు వస్తుంటారని అక్కడి వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క రాజాంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా నెలకొంది.



రాజాం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజయనగరం నగరపాలక సంస్థ, రాజాం, బొబ్బిలి మునిసిపాల్టీలు, నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు ఎస్.కోట, కొత్తవలస, గజపతినగరం, చీపురుపల్లి, భోగాపురం వంటి మేజర్ పంచాయతీల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా ఎక్కడిపడితే అక్కడే గుంపులుగా దర్శనమిస్తున్నాయి. వాటి సంతాన నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రధానంగా పల్లెల నుంచి కుక్కలు పట్టణాలకు చేరుతున్నాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చికెన్, మటన్ షాపుల వద్ద వ్యర్థాలను తింటున్నాయి. దీంతో వాటి సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్ష వరకూ కుక్కలు ఉన్నట్లు అంచనా. దీనిపై పశుసంవర్థక శాఖ వద్ద సరైన గణాంకాలు లేవు. ఏ ప్రభుత్వ ఆస్పత్రి రికార్డులు చూసినా కుక్క కాటు బాధిత కేసులు అధిక సంఖ్యలో ఉంటున్నాయి. కుక్కలు, పందుల నియంత్రణపై గత ప్రభుత్వం 2020 డిసెంబరు 30న ఓ జీవో జారీచేసింది. వాటిని పెంచుకోవాలంటే అనుమతులు తప్పనిసరి చేసింది. ఎటువంటి అనుమతులు లేకుండా పెంచితే సంబంధిత యజమానులకు రూ.500 జరిమానా విధించాలని ఆదేశాలిచ్చింది. అక్కడకు వినకుంటే రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించాలని పేర్కొంది. లైసెన్స్ జారీ, రెన్యువల్ బాధ్యతలు స్థానిక సంస్థలు చూసుకోవాలని పేర్కొంది. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసుకున్నట్టు, పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్టు ధ్రువపత్రం పొందాలని కూడా స్పష్టం చేసింది. కానీ, అవెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. అలాగే, కుక్కలు, పందుల నియంత్రణ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించింది. కానీ, ఎటువంటి నిధులు మాత్రం కేటాయింపులు చేయలేదు. దీంతో కుక్కల సంతతి పెరుగుతోంది. ప్రజారోగ్యానికి తీరని భంగం వాటిల్లుతోంది. రోజురోజుకూ కుక్కకాటు బాధితులు పెరుగుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా కుక్కల నియంత్రణపై దృష్టిపెట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



రాజాం పట్టణంలో రాత్రి వేళ సంచరిస్తున్న కుక్కలు

భయమేస్తోంది..

రాజాం పట్టణంలో కుక్కలు పెరిగిపోయాయి. ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. ఉదయం సాయంత్రం పిల్లలు స్కూళ్లకు వెళ్లినప్పుడు వారికి తోడుగా వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించాలి. కుక్కలను నియంత్రించాలి.

-పార్వతీశం, స్థానికుడు, రాజాం

జాగ్రత్తగా ఉండాలి

రాజాం సామాజిక ఆస్పత్రికి ప్రతినెలా 120 నుంచి 140 వరకూ కుక్కకాటు బాధితులు వస్తుంటారు. ఇటీవల కాలంలో కుక్కల దాడులు అధికమయ్యాయి. యాంటీ రేబిస్ ఇంజక్షన్లు వేస్తున్నాం. ముఖ్యంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి.

- తిరుపతిరావు, వైద్యుడు, రాజాం సామాజిక ఆస్పత్రి

జిల్లాలో కుక్కకాటు బాధితుల సంఖ్య	
2018	11,423
2019	12,924
2020	12,983
2021	20,896
2022	12,671
2023	11,666

దృష్టిపెడతాం

రాజాం మునిసిపాల్టీలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. వాటి సంతానోత్పత్తి నియంత్రణపై దృష్టిపెట్టాం. ఇప్పటికే కుక్కలను పట్టణానికి దూరంగా తరలించే ఏర్పాటు చేస్తున్నాం. హోటళ్లు, దుకాణదారులకు కూడా వ్యర్థాలు పారబోయవద్దని స్పష్టం చేశాం.

-జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మునిసిపాల్టీ

విపత్తుల వేళ తల దాచుకునేది ఎలా?

● శిథిలావస్థలో తుఫాన్ రక్షిత భవనాలు
● తీరప్రాంత వాసులకు తప్పని కష్టాలు
● వర్షం కురిస్తే వణుకే



6లో

కొత్తవలసలో ఈదురు గాలుల బీభత్సం

6లో

బియ్యం గింజలపై శ్రీరామ నామం

● భక్తి చాటుకున్న సుజన



6లో

ఉపాధి కోసం వెళ్లి.. ప్రాణాలు విడిచి

● మిషన్‌లో పడి మహిళ దుర్మరణం
● లక్కిడాంలో విషాదచాయలు

7లో



నవమి వేడుకలకు వేళాయె


సాలూరు రూరల్: సీతారాముల విగ్రహాలు

● ఆలయాలకు నూతన శోభ
● సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

శ్రీరామ నవమి వేడుకలకు ఉమ్మడి జిల్లాలోని రామాలయాలు సిద్ధమయ్యాయి. ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు... సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.


గాలి గోపురం

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం..

సాలూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా సాలూరులో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాల నిర్వహణకు వివిధ ఉత్సవ కమిటీలు సర్వం సిద్ధం చేశాయి. పెదకోమటిపేట రామాలయంలో 1956 నుంచి 70 ఏళ్లుగా క్రమం తప్పకుండా శ్రీరామ నవమి, వసంత నవరాత్రులు నిర్వహిస్తున్నారు. తొలుత ఉల్లి కామరాజ్ ఉత్సవాలకు పెదకోమటిపేట రామాలయంలో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఏటా నవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ కల్యాణం, పట్టాభిషేకానికి ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. దీనితో పాటు పట్టణం, పరిసర ప్రాంతాల్లోని డబ్బి వీధి, వెలమపేట తదితర చోట్ల ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.


పెదకోమటిపేటలోని రామాలయం వద్ద షామియానా

మన్యం జిల్లా కేంద్రంలో..


కొలువైన సీతారాములు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలోని 269 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారామ స్వామి ఆలయం శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమైంది. స్వాతంత్ర్యం రాకముందు ఒడిశా రాష్ట్రంలోని జయపూర్ సంస్థానంలో భాగమైన పార్వతీపురంలో అప్పటి రాజులు సీతారామస్వామి ఆలయాన్ని నిర్మించారు. వందేళ్ల ఏళ్లు గడిచినప్పటికీ ఆలయం నిర్మాణం చెక్కు చెదరకుండా ఉండడం విశేషం. మధ్యలో కొంత కాలం ఆలయం నిరాదరణకు గురైంది. కానీ పట్టణ ప్రముఖుల చొరవతో మళ్లీ పూర్వ వైభవం సంతరించుకొంది. కొన్నేళ్లుగా ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నవమి ఉత్సవాలకు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


సీతారామస్వామి ఆలయం

తోటపల్లి కోదండ రాముని ఆలయంలో..

గరుగుబిల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధి లోని కోదండ రామస్వామి ఆలయం శ్రీరామనవమికి సిద్ధమైంది. తోటపల్లిలో 1972లో నిర్మించిన కోదండరామస్వామి




కోదండరామస్వామి ఆలయం

ఆలయానికి ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. నాగావళి నదీ తీరాన ఉండటంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. విజయ నగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్‌రాష్ట్రాల నుంచి భక్తులు తోటపల్లిలోని ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా వార్షిక కల్యాణో త్సవంతో పాటు శ్రీరామ నవమి, సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

కోదండరామస్వామి వారి దేవస్థానంలో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీసీతారామస్వామి వారి కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ, అర్చకులు వీవీ అప్పలాచార్యులు తెలిపారు. దేవస్థానం పరిధిలో వసంత నవరాత్రి మహోత్సవాలను మార్చి 30 నుంచి ప్రారంభించినట్టు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా రూ. 500 చెల్లించాలన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల కోసం భద్రాచలం నుంచి ప్రసాదాలను తెప్పిస్తున్నామన్నారు.

గుళ్లసీతారాంపురంలో..

సంతకవిటి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్రుడు వెలసిన ప్రాచీన క్షేత్రాలలో విజయనగరం జిల్లా సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం ఒకటి. ఇక్కడి సీతారాముల ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో సీతారాములు స్వయంభూగా వెలిసినట్టు చారిత్రక కథనం. ఈ ఆలయానికి బొబ్బిలి రాజులు వంశ పారంపర్యంగా ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. ఈ ఆలయం మొత్తం రాళ్ల పేర్పుతో నిర్మించిన అద్భుత కట్టడం. ఇక్కడి గాలి గోపురం దాదాపు 65 అడుగుల పొడవు ఉంటుంది. గాలిగోపురం పైకి ఎక్కితే బొబ్బిలిలోని వేణుగోపాలుని ఆలయం కనిపిస్తుందని ప్రాశస్త్యం. స్వయంభూగా వెలసిన ఇక్కడి సీతారాములు ఏకాంతవాసంలో ఉన్నట్లు ఏకశిలపై కనిపించడం విశేషం. అత్యంత పురాతనమైన ఈ ఆలయంలో శ్రీరామనవమి రోజున స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తుంటారు.

బొబ్బిలి పట్టణంలో...

బొబ్బిలి ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని చినబజారు జంక్షన్‌లో బ్రిటీషు వారి కాలంలో డబ్బీరు కుటుంబీకులు నిర్మించినట్టుగా చెప్పుకునే శ్రీరామ మందిరం ఉంది. పరిమిశెట్టి కుటుంబీకులు, వ్యాపార కుటుంబాల వారు ఈ ఆలయంలో పూజాది కార్యక్రమాల నిర్వహణకు పూనుకుంటున్నారు. ఈ రామమందిరం పూర్తిగా శిథిలమైపోయినప్పటికీ రాములోరి పూజలు, కల్యాణమహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏటా క్రమం తప్పకుండా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం, ఇతర పర్వదినాలలో పురాణపఠనం, ప్రత్యేక పూజలు చేస్తారు. ఆదివారం శ్రీరామ నవమి వేడుకలకు ఈ ఆలయం ముస్తాబైంది. ఇప్పటికే ఉత్సవాలకు శుభరాట వేశారు. పూర్వ కాలం నాటి ఈ ఆలయం శిథిలావస్థలో ఉండడం గమనార్హం. వర్షానికి కారిపోకుండా ఉండడానికి దీనిపై పరదాలు కప్పి ఉంచారు.


కొలువుదీరిన సీతారాములు

బియ్యపు గింజలపై శ్రీరామ నామం

● భక్తిని చాటుకున్న సుజన


బియ్యపు గింజలపై శ్రీరామ అని రాసిన దృశ్యం


శ్రీరామ నామాలు రాస్తున్న సుజన

నెల్లిమర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బియ్యపు గింజలపై శ్రీరామ అనే పదం రాసి శ్రీరాముడిపై ఉన్న భక్తిని చాటుకుంది ఓ మహిళ. అంతే కాకుండా ఆ బియ్యం గింజలను జిల్లాలో పలు శ్రీరామ ఆలయాలకు పంపిణీ చేసి ఆదివారం జరగనున్న నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవంలో తలంబ్రాలుగా వాడుకునేందుకు వీలు కల్పించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శృంగవరపుకోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కాపుగంటి సుజన, కనరాజు దంపతులు రామ భక్తులు. గతేడాది సుమారు 22 వేల బియ్యం గింజలపై పెన్నుతో శ్రీరామ అనే పదం రాసి జిల్లాలోని పలు రామాలయాలకు పంపిణీ చేశారు. ఈ ఏడాది కూడా సుమారు 15 వేల బియ్యం గింజలపై శ్రీరామ అని పెన్నుతో రాసి చిన్న కవర్లుగా తయారుచేసి జిల్లాలోని 11 ఆలయాలకు అందజేశారు. శనివారం రామతీర్థంలోని రామ స్వామివారి దేవస్థానంలో కనక రాజు, సుజన దంపతులు ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి సాయిరామాచార్యులకు బియ్యం గింజలను అందజేశారు. సీతారాముల కల్యాణోత్సవంలో తలంబ్రాలులో కలిపి వీటిని వాడనున్నారు. ఈ సందర్భంగా కాపుగంటి కనకరాజు, సుజన దంపతులను అర్చకులు అభినందించారు.


కొత్తవలస జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

కొత్తవలసలో ఈదురుగాలుల బీభత్సం


ఈదురుగాలులకు ఊగుతున్న చెట్లు

కొత్తవలస, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులతో పాటు ఉరుములు, మెరుపులకు ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. కొత్తవలస జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రోడ్డు మీద పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

విపత్తుల వేళ తల దాచుకునేది ఎలా?

● శిథిలావస్థలో తుఫాన్ రక్షిత భవనాలు ● తీరప్రాంత వాసులకు తప్పని కష్టాలు ● వర్షం కురిస్తే వణుకే


ముక్కాంలో దెబ్బతిన్న తుఫాన్ భవనం


కొండ్రాజుపాలెంలో శిథిలమైన తుఫాన్ భవనం

భోగాపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సమయంలో మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుఫాన్ పేరు వింటే చాలు.. సముద్ర తీర ప్రాంత గ్రామాలు గజగజ వణుకుతాయి. దీనికి ప్రధాన కారణం తల దాచుకోవడానికి సరైన చోటు లేకపోవడమే. ముఖ్యంగా అధిక శాతం తీర గ్రామాల్లో తుఫాను రక్షిత భవనాలు లేవు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు తల దాచుకోవడానికి గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి తుఫాన్ రక్షిత భవనాలు నిర్మించాయి. ఇవి అప్పట్లో తుఫాన్ సమయాల్లో తీర ప్రాంత గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేవి. తుఫాన్ల వంటి విపత్తుల సమయంలో ప్రజలను ఈ భవనాలకు తరలించేవారు. ప్రస్తుతం తీర ప్రాంతంలో ఉన్న అన్ని గ్రామాల్లో దాదాపుగా అన్ని తుఫాను రక్షిత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని పూర్తిగా శిథిలమవగా... మరి కొన్ని ఏ క్షణమైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అక్కడక్కడా బహుళ ప్రయోజన భవనాలు నిర్మించినా... గ్రామాలకు దూరంగా ఉండడంతో ఉపయోగం లేకుండా పోతున్నాయి. ఈ భవనాలు కూడా మందుబాబులకు అడ్డాగా మారాయి.

పాఠశాలలు... ఆలయాలే దిక్కు

ప్రస్తుతం తుఫాన్ సమయంలో ఆలయాలు, పాఠశాలలు, ప్రేవేటు భవనాల్లో తల దాచుకోవలసి వస్తోంది. సమయం ఉంటే దూర ప్రాంతాలకు బంధువుల ఇళ్లకు తరలిపోవలసిందే. భోగాపురం మండలంలో ముక్కాం, చోడిపల్లిపేట, చినకొండ్రాజుపాలెం, పెదకొండ్రాజుపాలెం, చేపలకంచేరు, ఎర్రముసలయ్యపాలెం, కోలవానిపాలెం తీర గ్రామాలు. పూసపాటిరేగ మండలం పరిధిలోని చింతపల్లి, నీలిగెడ్డపేట, బర్రిపేట, పెద్దూరు, కొత్తూరు, తమ్మయ్యపాలెం, బర్రిపేట, తిప్పలవలస, కొత్తూరు, మద్దూరు, కోనాడ, బొడ్డుగురయ్యపేట, బొడ్డువెంకటేషుపేట, పులిగెడ్డ గ్రామాలు తీరంలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 12 వేల నుంచి 15 వేల మంది నివశిస్తున్నారు. తుఫాన్ల సమయంలో హడావుడి చేసే అధికారులు.. ఆ తరువాత తీర గ్రామాల వైపే చూడడం లేదనడం అతిశయోక్తి కాదు. వర్షాకాలంలో ఎక్కువగా తీరప్రాంత ప్రజలు నష్టపోతుంటారు. ఈ ఏడాది వర్షాకాలం వచ్చేలోగా తీర గ్రామాల్లో రక్షిత భవనాలను నిర్మించాలని... మరికొన్నిటికి మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆ రహదారికి మంచి రోజులు

● పార్వతీపురం- పాలకొండ రోడ్డు మెరుగుకు చర్యలు


తోటపల్లి కుడి ప్రధాన కాలువ ప్రాంతంలో పనులు చేస్తున్న దృశ్యం


ఎర్రన్నగుడి ప్రాంతంలో చదును చేసిన ప్రధాన రహదారి

గరుగుబిల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ వెళ్లే ప్రధాన రహదారికి మంచి రోజులు వస్తున్నాయి. ఈ రోడ్డు మెరుగుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారి అడుగడుగునా గతుకులమయమై ప్రయాణికులకు నరకం చూపించింది. ఈ మార్గంలోని గోతులు భయంకరంగా దర్శనమిచ్చేవి. ఐదేళ్ల పాలనలో రహదారి వైపు చూడని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రధాన రహదారులు మెరుగుపై దృష్టి పెట్టింది. ముందుగా రహదారికి మరమ్మతులు చేపట్టింది. ప్రస్తుతం ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి ప్రాంతంలో ప్రధాన రహదారి నిర్మాణానికి యంత్రాలతో అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా తోటపల్లి కుడి ప్రధాన కాలువ ప్రాంతంలోని రహదారి ప్రమాదకరంగా తయారైంది. దీని కోసం మొత్తం 1100 మీటర్ల బీటీ రహదారి పనులకు ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. ముందుగా గతుకులు ఉన్న ప్రాంతంలో యంత్రాలతో చదును చేస్తున్నారు. ఆ తరువాత బీటీ పనులు చేయనున్నారు. అలగే అడ్డాపుశీల నుంచి పార్వతీపురం వైపు వెళ్లే ప్రధాన రహదారి మెరుగుకు రూ.40 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ వాసిరెడ్డి రామ్మోహనరావు తెలిపారు. పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా...కొన్ని రహదారులకు నిధులు మంజూరైనా... సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు మొదలుకావడం లేదు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు

● చీపురుపల్లి రోడ్డు నిర్మాణం పూర్తికాక ముందే షాపుల ఏర్పాటుకు చర్యలు

● ఆక్రమణలను తొలగించిన మునిసిపల్ అధికారులు



చీపురుపల్లి రోడ్డులో ఆక్రమణలను తొలగించిన దృశ్యం

రాజాం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీ పరిధిలోని చీపురుపల్లి రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు జోరందుకున్నాయి. ఇదంతా మునిసిపాలిటీలో కొందరు సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఎర్ర చెరువు గట్టు వద్ద ఫుట్‌పాత్ వెంబడి రాత్రికి రాత్రే కర్రలు పాతి స్థలాల ఆక్రమించుకున్నారు. ఇందులో పెద్దలు కూడా ఉండటం గమనార్హం. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ రామప్పలనాయుడు ఆక్రమణలను తొలగించే ఏర్పాటు చేశారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో గతంలో ఆ స్థలంలో ఉన్న షాపులను తొలగించి కాలువ నిర్మాణం చేపట్టారు. శ్రీనివాస థియేటర్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న వారి షాపులను తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా షాపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు. దాంతో శ్రీనివాస థియేటర్ రోడ్డులో కొంతమంది వ్యాపారులు ఎర్ర చెరువు గట్టును ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్ వెంబడి కర్రలు పాతారు. గతంలో ఇక్కడ దుకాణాలు నడిపిన వారు కూడా ఖాళీస్థలాలను ఆక్రమించే ప్రయత్నాలు చేశారు. గతంలో అక్కడ ఎవరైతే వ్యాపారాలు చేశారో వారికి దుకాణాలు నిర్మించి అద్దెకు ఇస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, మునిసిపల్ కమిషనర్ జె.రామప్పల నాయుడు ప్రకటించినప్పటికీ ఆవేమీ పట్టించుకోకుండా ఆక్రమణలకు పాల్పడ్డారు. వాస్తవంగా ఈ ప్రాంతం ట్రాఫిక్‌పరంగా రెడ్‌జోన్‌లో ఉంది. నిత్యం భారీ వాహనాలతో రోడ్డు బిజీగా ఉంటుంది. ఇటీవల రూ.1.25 కోట్లతో ఎర్ర చెరువు ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలు జరిగితే వాకింగ్ నిమిత్తం వచ్చే వారి వాహనాలకు పార్కింగ్ సమస్యలు ఎదురవుతుంది. చీపురుపల్లి రోడ్డులో మసీద్‌లో ప్రతి శుక్రవారం పెద్ద సంఖ్యలో ముస్లిం హాజరై ప్రార్థనలు చేస్తుంటారు. వారి వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది కలగనుంది. దీంతో ఆక్రమణదారులపై మునిసిపల్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారులను కట్టడి చర్యలు ముమ్మరం చేశారు.

డిప్యూటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో డిప్యూటేషన్‌పై లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డైట్ కళాశాలలో 6 సీనియర్ లెక్చరర్స్, 17 లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. 58 సంవత్సరాల లోపు వయస్సు గల ఉమ్మడి విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న ఆసక్తి గల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లు ఈనెల 10లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 16, 17 తేదీల్లో రాతపరీక్ష, 19న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

8 నుంచి బాలాజీ బ్రహ్మోత్సవాలు

రాజాం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి సమీపంలోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 8 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. శనివారం దేవస్థానం ప్రతినిధులు ఓ ప్రకటన విడుదల చేశారు. 8న దీక్షా భిషేకం, అంకురార్పణ, 9న ధ్వజారోహణం, 10న పల్లకిసేవ, తిరుమంజనం, డోలోత్సవం, 11న కల్యాణోత్సవం, 12న పల్లకి ఉత్సవం, డోలోత్సవం, 13న మిధున లగ్నంలో చక్రస్నానం, అన్న సమారాధన, పుష్పయాగం, ద్వాదశారాధన, మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, సప్తావరణ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 14తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థానం ప్రతినిధులు వెల్లడించారు.

కొత్తఅగ్రహారంలో నవమి ఏర్పాట్లు పూర్తి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 5: (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తఅగ్రహారంలోని పురాతన సీతారామ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈవో పద్మావతి, స్థానిక భక్తుల సహకారంతో ఈ ఆలయంలో నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు సీతారామలక్ష్మణ అంజనేయస్వామి వారి విగ్రహాలకు తిరువీధి, అనంతరం సీతారాములకు కల్యాణాన్ని నిర్వహించనున్నారు. నవమి నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఏఎంసీ పాలకవర్గంపై కసరత్తు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంపై కసరత్తు జరుగుతోంది. మొత్తం 16 మంది సభ్యులకు గాను నలుగురు అధికారులు ఉండగా, మిగిలిన 12 మంది సభ్యులు వివిధ రాజకీయ పార్టీల నుంచి డైరెక్టర్లుగా నియమితులు కానున్నారు. చైర్మన్‌గా ఇప్పటికే నగరంలోని గాజులరేగ ప్రాంతానికి చెందిన కర్రోతు వెంకట నర్సింగరావు నియమితులు కాగా, వైఎస్ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. దుప్పాడ ప్రాంతానికి చెందిన చంద్రి నాయుడు వైఎస్ చైర్మన్‌గా ఎంపిక కానున్నట్టు సమాచారం. మరోవైపు బీజేపీకి కూడా ఒక డైరెక్టరు పదవిని కేటాయించారు. వీరిలో ఎస్సీ ఎస్టీ ఒక్కొక్కరు, బీసీతో పాటు ఇతర వర్గాల నుంచి ఎంపిక చేయనున్నారు.

'ఉద్యమాలతో సమగ్ర అభివృద్ధి సాధ్యం'

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వెనుకబడిన జిల్లా కాదని, వెనక్కి నెట్టబడిన జిల్లా అని విజయనగరం సమగ్రాభివృద్ధికి ప్రజా ఉద్యమాలతోటే సాధ్యమని ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ కె.ఎస్.చలం అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే జిల్లా ప్రజలకు ఉపాధి కల్పించడమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడారు.రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన చర్చా వేదికలో అట్టాట అప్పలనాయుడు, గంటేడ గౌరీనాయుడు, డాక్టర్ జయపాల్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డి.రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ వీసీ చలం

యువతిపై దాడి ఘటన బాధాకరం



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యువతిపై దాడి ఘటన బాధాకరమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అన్నారు. గరివిడి మండలం శివరాంలో యువతిపై దుండగుడి దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతిని వారు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ ప్రశాంతమైన జిల్లాలో ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. బాధితురాలికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. మహిళలపై దాడులు చేసిన వారు ఎవరైనా తమ ప్రభుత్వం ఊపేక్షించమన్నారు. చట్ట ప్రకారం నిందితుడికి శిక్ష పడేలా చూస్తామన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉందని, ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



రుణాల యూనిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం ఆమె నివాసంలో సోంపురం, నీలకంఠాపురం గ్రామాల లబ్ధిదారులకు పాసింజర్ ఆటో, నర్సరీ మొక్కలను అందజేశారు. ప్రధానమంత్రి అనుచిత్ జాతీయ అభ్యుదయ యోజన ద్వారా నర్సరీ, పీఎంఈజీపీ ద్వారా రెండు ఆటోలు, ఫొటో స్టూడియోకు సంబంధించిన కెమెరాలు మంజూరయ్యాయని తెలిపారు. సబ్సిడీ రుణాలు అందించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎమ్మెల్యే లలితకుమారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేపాడ మండల పార్టీ నేతలు కె.రమణమూర్తి, పోతల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అదితిని కలిసిన ఏఎంసీ చైర్మన్ కర్రోతు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ అధిష్ఠానం ప్రకటించిన గాజులరేగ ప్రాంతానికి చెందిన కర్రోతు నర్సింగరావు శనివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఇఫ్కో బోర్డు సమావేశంలో బంగార్రాజు



బంగార్రాజుకు ఇఫ్కో బోర్డు షీల్డ్ అందిస్తున్న దృశ్యం

భోగాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో శనివారం నిర్వహించిన ఇఫ్కో బోర్డు డైరెక్టర్ల సమావేశానికి ఇఫ్కో డైరెక్టర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తొలిసారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇఫ్కో డైరెక్టర్‌గా నియామక ధ్రువీకరణ పత్రం, షీల్డ్‌ను బంగార్రాజుకు ప్రదానం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని బంగార్రాజు అన్నారు.

విద్యుత్, రెవెన్యూ సమస్యలపై నిలదీత



మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మెరకముడిదాం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశంలో విద్యుత్, రెవెన్యూ సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. విద్యుత్ శాఖ సమీక్షలో ఏఈ దివాకర్ మాట్లాడుతుండగా గర్భాం మేజరు పంచాయతీ సర్పంచ్ గాబ్రియల్ కల్పించుకుని మండలంలో తగినన్ని ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో లోవోల్టేజీ సమస్య ఎదురవుతోందన్నారు. వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతున్నాయన్నారు. పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అలాగే రెవెన్యూ శాఖ సమీక్షలో మ్యూటేషన్లు, ఆదాయ కుల, ధ్రువీకరణ పత్రాల జారీకి అధికారులు తాత్సారం చేస్తున్నారని మండల ఉపాధ్యక్షుడు తలచట్ల హరిబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని తహసీల్దార్ అజురఫీ జాన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో జి.భాస్కరరావు, ఏవో శ్రావణి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చెరువులో శివలింగం లభ్యం



తవ్వకాల్లో బయటపడిన శివలింగం

నెల్లిమర్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట ఎర్ర చెరువులో శనివారం శివలింగం లభ్యమైంది. చెరువులో ఉపాధి వేతనదారులు తవ్వుతుండగా పురాతన శివలింగం బయటపడింది. వేతనదారులు ఆ శివలింగాన్ని చెరువు పక్కనే ఉన్న చెట్టు కిందకు తీసుకువెళ్లి శుభ్రం చేశారు. కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు శివలింగాన్ని చూసేందుకు తరలివచ్చారు.

అనాథలపై ఆర్టీసీ ఎండీ ఔదార్యం

● భద్రాచలంలో నవమి వేడుకలు తిలకించేందుకు బస్సు సౌకర్యం



భద్రాచలం బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న బస్సు

రేగిడి, మార్చి 5, (ఆంధ్రజ్యోతి): మండలంలో వావిలవలస రాహుల్‌సౌరబ్ అన్నదాన సత్రంలోని అనాథలపై ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ద్వారకా తిరుమలరావు ఔదార్యం చూపారు. భద్రచలంలో శ్రీరామనవమి వేడుకలు తిలకించేందుకు ఇక్కడి సత్రంలోని అనాథలకు ప్రత్యేక బస్సు సమకూర్చారని సత్రం నిర్వాహకుడు, సామాజిక కార్యకర్త పాలూరి సిద్దార్థ తెలిపారు. శనివారం రేగిడి మండలం వావిలవలస నుంచి బస్సు బయలుదేరింది. అనాథలకు స్వామి దర్శనానికి ఏర్పాట్లు చేసిన ఆర్టీసీ ఎండీకి సత్రం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణం అడ్డగింత



పనులు అడ్డుకున్న సర్పంచ్, గ్రామస్థులు

జామి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగరంలో సెల్‌టవర్ పనులను సర్పంచ్ వని పార్వతి ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. ఈ విషయంపై సర్పంచ్ మాట్లాడుతూ గతంలో నివాస ప్రాంతంలో సెల్ టవర్ వేయడం వల్ల ప్రజలు రేడియేషన్‌తో ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఇప్పుడు దాని పక్కనే మరో టవర్‌ను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ టవర్ పనులు పంచాయతీ అనుమతులు లేకుండా ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు అక్కడకు చేరుకుని మాట్లాడారు. తాము ఆన్‌లైన్‌లో అనుమతులుకు దరఖాస్తు చేసుకున్నామని అందుకే పనులు ప్రారంభించామన్నారు. పంచాయతీ అనుమతులపై ప్రశ్నించగా సమాధానం చెప్పలేకపోయారు.

పిడుగుపాటుతో గేదె మృతి

● మరోచోట మహిళకు గాయాలు

లక్కవరపుకోట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం వేర్వేరు చోట్ల పడిన పిడుగులకు గేదె మృతి చెందగా ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తహసీల్దారు ప్రసాదరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్లేపల్లిలో భూమిరెడ్డి పెదవెంకటరావుకు చెందిన సుమారు రూ.60 వేల విలువైన గేదె పిడుగుపడి మృతి చెందిందని తెలిపారు. అలాగే రేగ గ్రామానికి చెందిన జూరెడ్డి వరలక్ష్మి పిడుగుపాటుకు గురై గాయాపాలైందని, ఆమెను కొత్తవలస ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఆమె ఆరోగ్యం కొద్దిగా మెరుగుపడినట్టు వైద్యులు తెలిపారన్నారు. రెండింటిపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

65 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొండపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటిలో అక్రమంగా మద్యంను విక్రయిస్తుండగా దాడి చేసి 65 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ యు.మహేశ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సుంకరి ఈశ్వరరావు ఇంటిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టుగా అందిన ఫిర్యాదు మేరకు దాడి చేశామన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు ఉన్నారన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



బ్యాగ్‌ను అందిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకుని ఆదర్శంగా నిలిచాడు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నగరంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయం వద్ద వృద్ధురాలు వారణాసి సావిత్రి ఆటో దిగి షాపింగ్‌కు వెళ్లింది. ఈక్రమంలో ఆమె ఆటోలో హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయింది. కొంతసేపటి తర్వాత ఆ బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ నంది దిలీప్‌కుమార్ గుర్తించాడు. సంబంధిత బ్యాగ్‌ను కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఏఎస్‌ఐ యు.రమేశ్‌కు అప్పగించారు. ఆధారాలను తెలుసుకుని ఆమెను ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి బ్యాగ్‌ను అందజేశారు. బ్యాగ్‌లో బంగారు చెవిదిద్దులు, నగదు ఉన్నాయని నిజాయితీగా వ్యవహరించిన దిలీప్‌కుమార్‌ను ట్రాఫిక్ పోలీసులు అభినందించారు.

ఇందిరమ్మ కాలనీకి రోడ్డు వేయండి

గరివిడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలో ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. కాలనీలోని ఐదు వీధుల్లో సుమారు 150 కుటుంబాలు నివసిస్తుండగా, ఇందులో 2 వీధులకు మాత్రమే సీసీ రోడ్లు, డ్రైన్లు ఉన్నాయి. దీంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కుళాయిల నుంచి కూడా నీరు లీకవుతుండటంతో దారి బురదమయంగా మారుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఇందిరిమ్మ కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి



ఉపాధి కోసం వెళ్లి.. ప్రాణాలు విడిచి

● మిషన్‌లో పడి మహిళ దుర్మరణం

● లక్కిడాంలో విషాదచాయలు



ఘటనా స్థలంలో గుమిగూడిన జనం



జ్యోతి (ఫైల్)

గంట్యాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో కర్రలకు తొక్కలు తీసే మిషన్‌లో పడి ఓ మహిళ శనివారం దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళితే.. సిరిపురంలో వివిధ కర్రలకు తొక్కే మిషన్ల వద్ద లక్కిడాంకు చెందిన అసకపల్లి జ్యోతి (30) పనిచేస్తోంది. రోజు మాదిరిగానే శనివారం పనికి వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం పనిచేసేందుకు సిద్ధమైంది. ట్రాక్టరుకు అనుకుని ఉన్న మిషన్ వద్దకు వెళ్లింది. మిషన్ స్పీడుగా తిరుగుతుండటంతో ఆమె చీర ప్రమాదవశాత్తు మిషన్‌లోకి వెళ్లి పోయింది. ఆ తర్వాత ఆమె జుట్టును కూడా మిషన్ లాగేసింది. దాంతో ఆమె జుట్టు ఊడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. గంట్యాడ ఎస్‌ఐ సాయికృష్ణ అక్కడకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మృతురాలి భర్త పరదేశినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతురాలికి భర్త పరదేశినాయుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ప్రశాంతి ఐదో తరగతి, చిన్న కుమార్తె ఒకటో తరగతి చదువుతోంది. జ్యోతి మృతితో లక్కిడాంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఆటో బోల్తా: ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు



లక్ష్మణ్‌రావు(ఫైల్)

సీతంపేట రూరల్/పాలకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఇసుకగెడ్డ గ్రామ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడిన ప్రమాదంలో పాలకొండ మండలం వెలగవాడ గ్రామానికి చెందిన గొట్టాపు లక్ష్మణ్‌రావు(44) మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేట నుంచి పాలకొండ వైపు నలుగురు ప్రయాణికులతో ఆటో వెళ్తోంది. ఇసుకగెడ్డ సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వారిని స్థానికులు 108 వాహనంలో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గొట్టాపు లక్ష్మణ్‌రావు మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కోడిశ గ్రామానికి చెందిన కె.చిన్నమ్మి, కె.విజయశాంతిలను పాలకొండ ఏరియా ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మేరి, ఇద్ద రు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ వై.అమ్మన్నరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

● ఇదిలా ఉండగా సకాలంలో వైద్య సిబ్బంది స్పందించకపోవడం వల్లే లక్ష్మణరావు చనిపోయాడని మృతుడి బంధువులు పాలకొండ ఏరియా ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. ఆసుపత్రి సెక్యూరిటీ వారిని శాంతింపజేశారు.

పరామర్శకు వెళ్లి.. ప్రమాదానికి గురై

● ఆటో బోల్తా : 11మందికి గాయాలు



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవలస సమీపంలో శనివారం ఆటో బోల్తా పడిన ఘటనలో 11మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కొండదేవుపల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు, ముగ్గురు పురుషులు శనివారం సాయంత్రం పక్కి గ్రామంలో వా రి బంధువులు చనిపోయారని తెలిసి ఆటోలో బయలుదేరారు. ఆటో కమ్మ వలస సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు సరిగ్గా లేకపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మహిళలకు స్వల్ప గాయాలు కాగా, ఇద్దరు పురుషులు బి.పారినాయుడు, బి.లక్ష్మనాయడుతో పాటు ఆటోడ్రైవర్ పి.వెంకటరమణలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కమ్మవలస గ్రామస్థులు బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన, డీఎస్పీ భవ్యరెడ్డి, సీఐ ఎ.సతీష్‌కుమార్ బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, క్షతగాత్రులను పరామర్శించారు. ముగ్గురు పురుషులకు తీవ్ర గాయాలయ్యాయని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలిస్తామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తన భర్త సిరిపురపు నాని మార్చి 31వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ చినమేరంగి గ్రామానికి చెందిన బంగారు శిరీష ఈనెల 1న ఎస్పీ మాధవరెడ్డిని కలిసి ఫిర్యాదు అందజేశారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తన భర్త కనిపించకపోవడంతో బంధువులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వెతికించినా కనిపించలేదని పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.అనీష్ తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి

లక్కవరపుకోట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన గోకాడ కృష్ణమ్మ (46) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొద్దికాలం క్రితం ఆమె భర్త హఠాన్మరణం పొందారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం బాగోలేదని సర్పంచ్ గోగాడ సత్యం తెలిపారు. ఆమె మృతిపట్ల అంగన్‌వాడీల సిబ్బందితో పాటు యూనియన్ నేతలు గాడి అప్పారావు, తరిని వెంకటరమణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఒడిశా పవర్ ప్రాజెక్టును అడ్డుకోవాలి



మాట్లాడుతున్న బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా సరిహద్దు వివాదాస్పద కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పవర్ ప్రాజెక్టును అడ్డుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో 21 గ్రామాలు వివాదాల్లో ఉన్నాయన్నారు. ఇరు రాష్ట్రాల వారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా స్టేటస్‌కో విధించారన్నారు. ఆంధ్ర రాష్ట్రం గౌరవంతో వ్యవహరిస్తున్నా, ఒడిశా ప్రభుత్వం అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారన్నారు. 21 గ్రామాల గిరిజన ప్రజలను భయపెడుతూ గ్రామాలను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌరవేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, రామ్మోహనరావు, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలన విధించాలి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది నెలల నుంచి ఏదో ఒకచోట దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. అవి ఆగాలంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. గరివిడి మండలం శివరాంలో కత్తిపోటుకు గురైన కోంద్రు అఖిల నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమెను పరామర్శించారు. అనంతరం జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలను తక్షణమే అరికట్టాలని లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఆయనతో పాటు వైసీపీ మహిళా నాయకురాలు గదుల సత్యలత ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కొత్తవలస, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గ్రామాలకు గ్రామదేవత వెదుళ్ల పైడితల్లమ్మ పండగ సందర్భంగా కర్రి చిన్నయ్యపాలెం గ్రామంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. వీరభద్రపురం లోని వెదుళ్ల పైడితల్లమ్మ వీరభద్రపురం, నరపాం, కర్రిచిన్నయ్యపాలెం, ములగ పాకవానిపాలెం, కొట్యానవానిపాలెం, వియ్యంపేట, గొల్లలపాలెం గ్రామాలకు గ్రామ దేవతగా పూజిస్తుంటారు. గ్రావదేవత పండగను ఏటా 9 రోజుల పాటు నిర్వహిస్తారు. 14న తొలేళ్ళు, 15న అనుపు చేపట్టనున్నారు. పండగ సందర్భంగా నిర్వాహకులు మండల స్థాయిలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల్లో 36 జట్లు తలపడనున్నాయి.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రాజాం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజాంలో క్రైస్తవులు శనివారం శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. బొబ్బిలి రోడ్డులోని గ్యాస్ ఏజెన్సీ నుంచి పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకూ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రవీణ్‌ను హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. రాజాం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పెద్దఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయించండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

సంతకవిటి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు పంచాయితీ సోమన్నపేట గ్రామానికి గరికపాడు నుంచి బీటీ రోడ్డు మంజూరు చేయించాలని కోరుతూ సోమన్నపేట గ్రామస్థులు శనివారం తూర్పుకాపు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేక అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వైసీపీ హయాంలో మండలంలో ఎక్కడా రోడ్డు నిర్మాణాలు జరగలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో రోడ్డు నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలో ఇటీవల బీటీ రోడ్ల నిర్మాణం కోస ప్రభుత్వం రూ.8.98 కోట్ల మంజూరు చేసిందన్నారు. ఈ రోడ్డు విషయాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌తో మాట్లాడతానన్నారు. రహదారి మంజూరుకు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ప్రభుత్వాన్ని కోరింది. శనివారం నగరంలోని యూత్ హాస్టల్ భవనంలో నిర్వహించిన ఎస్టీయూ సమావేశంలో సంఘ నేతలు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబు మాట్లాడారు. పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. 30 శాతం ఐఆర్‌ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతకుముందు మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి సంఘనాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఉద్యమనేత విజయరామరాజు చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిట్టిబాబు, ఎం.ఎ.స్వామి, రాంబాబు, రమణతో పాటు పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

సారా నియంత్రణకు సహకరించండి

విజయనగరం క్రైమ్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సారా నియంత్రణకు సహకరించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్-2 రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి కోరారు. శనివారం నవోదయం 2.0లో భాగంగా కార్యాలయంలో గంట్యాడ మండలం బెల్లం వ్యాపారస్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మట్లాడుతూ సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం అమ్మకూడదన్నారు. బెల్లం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామాలయంలో పూజలు

గజపతినగరం, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో సీతారాములకు కల్యాణం, సోమవారం సీతారాములకు పట్టాభిషేకం నిర్వహించనున్నామని ఈవో శ్రీరామ్ తెలిపారు. మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్యస్వామి అన్నసమారాధన చేపట్టనున్నారు. అలాగే బజార్ సెంటర్‌లో ఆలయంతో పాటు అభయాంజేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



సాలూరు: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి



గుమ్మలక్ష్మీపురం: నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



విజయగనగరం: టీడీపీ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్, ఎమ్మెల్యే అదితి

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు

దివంగత నేత, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఉమ్మడి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. కేంద్ర న్యాయ, రక్షణ, వ్యవసాయ శాఖల్లో మంత్రిగా పనిచేసి, దేశంలోని ఎన్నో సంస్కరణలకు జగ్జీవన్‌రామ్ మూలపురుషుడు అయ్యారని కొనియాడారు. అత్యధిక కాలం పార్లమెంటేరియన్‌గా పని చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



పాలకొండ: టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవి..



పార్వతీపురం: ఐటీడీఏ కార్యాలయంలో పీవో అశుతోష్ శ్రీవాస్తవ..



డెంకాడ: ఐదో పోలీస్ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ లక్ష్మీనారాయణ..



పార్వతీపురం /టౌన్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

నేడు దాడితల్లి సిరిమాను తరలింపు

బొబ్బిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం వచ్చే నెల 4, 5, 6 తేదీలలో నిర్వహించనున్నందున ఇందుకు అవసరమైన సిరిమాను చెట్టును ఆదివారం ఉదయం కృష్ణాపురం నుంచి తరలిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులంతా హాజరు కావాలని వారు కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఎంఆర్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాగాన సునీల్‌కుమార్, ఎమ్మెల్యే పీఆర్వో కోటగిరి హర్షవర్దన్‌లు శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. డీఎస్పీ భవ్యారెడ్డి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం డీఎస్పీతో పాటు సీఐ కె.సతీష్‌కుమార్ మజ్జిగను పంపిణీ చేశారు. ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు కింతలి రాము పాల్గొన్నారు.

నైతిక విలువలు అలవరచుకోండి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

బొబ్బిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలు నైతిక విలువలు అలవరచుకోవాలని డిప్యూటీ డీఈవో కె.మోహనరావు అన్నారు. స్థానిక శ్రీనిధి పాఠశాలలో శనివారం రాత్రి ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెం ట్ రౌతు వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పాల్గొని, మాట్లాడారు. ఎంఈవో చల్లా లక్ష్మణరావు, సీఐ కటకం సతీష్‌కుమార్, విద్యా సంస్థల చైర్మన్ రౌతు రామ్మూర్తి, టీడీపీ నాయకుడు అల్లాడ భాస్కరరావు, డైరక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాంబ పండుగను విజయవంతం చేయండి

- మంత్రి సంధ్యారాణి
- అధికారులతో సమీక్ష

సాలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సుమారు 14 ఏళ్ల తర్వత నిర్వహిస్తున్న సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మే 18, 19, 20 తేదీల్లో అమ్మవారి పండుగ నిర్వహిస్తున్నామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. పట్టణంలో 12 ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు నూతనంగా 52 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పండుగ సందర్భంగా పట్టణ ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమావేశానికి హాజరుకాని సిబ్బందికి మేమోలు ఇవ్వాలని ఇన్‌చార్జి కమిషనర్ వరప్రసాద్‌కు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, నిమ్మాది తిరుపతిరావు, ముఖీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి

బొబ్బిలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం భద్రతలేని విధానాలను ప్రవేశపెడుతోందని, వీటిని వ్యతిరేకించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో గురజాడ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని, ప్రసంగించారు. పీఎఫ్ ఆర్‌డీఏ బిల్లును దేశవ్యాప్తంగా అందరూ వ్యతిరేకించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి మారలేదని ఆమె ఆరోపించారు. సీపీఎస్, ఓపీఎస్, యూపీఎస్ ఇలా పేర్లు మార్పు తప్ప పెద్ద వ్యత్యాసం ఏమీ లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులకు పెన్షన్ రూల్స్ తీరని నష్టం చేకూర్చుతాయన్నారు. ఈ సదస్సులో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు రెడ్డి కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ సంఘం నేత నల్ల వెంకటనాయుడు, యూటీఎఫ్ నాయకులు జి.వెంకటనాయుడు, కేశవరావు, రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సీఐటీయూ నాయకుల సమావేశం

పాలకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, యూనియన్ అధ్యక్షుడు మండంగి హరినాథ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం వారు ఫీల్డ్ అసిస్టెంట్లతో నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా గ్రామీణ పేదలకు ఎంతో సేవలు అందిస్తున్న ఫీల్డ్ అస్టెంట్లకు నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం విచారకరమన్నారు. వారికి రక్షణ కల్పించి పీఎఫ్,ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈసదస్సులో సీఐటీయూ మండల నాయకులు కాద రాము, సాయితేజ, రాంప్రసాద్, రాంబాబు తదితరులు ఉన్నారు.

పాఠశాల భవనాన్ని నిర్మించరూ..



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బట్టివలస గ్రామంలో పాకలో నిర్వహిస్తున్న పాఠశాలను ఎస్ఎఫ్ఐ బొబ్బిలి పట్టణ కార్యదర్శి ఎస్.శివ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మంది విద్యార్థు లు ఉన్న ఈ గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. శాశ్వత పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, గతంలో అదానీతో చేసుకున్న సేకీ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఎం.బూర్జవలస గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం 'మా ఇంటికి స్మార్ట్ మీటర్ పెట్టొద్దు.. కరెంటు చార్జీలు తగ్గించాలి' అని ప్రచారం చేస్తూ ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

భూదేవిని కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు

పాలకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు శనివారం టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవిని మండల కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమెను శాలువతో సత్కరించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముంజేటి త్రినాధరావు, డైరెక్టర్లు మూర మోహన్‌రావు, సవర మంగయ్య, కొత్తకోట వేణమ్మ, మండల గజలక్ష్మి పాల్గొన్నారు.

జేకేపాడులో 'నవోదయం'

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జేకేపాడు గ్రామంలో శనివారం నవోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు నాయుడు మాట్లాడుతూ ఎవరైనా సారా తయారు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు సరే.. ప్రారంభించేదెప్పుడో?

- నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనాలు
- అద్దె భవనాల్లో అవస్థలు పడుతున్న చిన్నారులు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని జగన్నాథపురం గ్రామంలో గత ఏడాది నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం చిన్నారులు అద్దె భవనంలో అసౌకర్యాల నడుమ చదువు సాగిస్తున్నారు. అలాగే రాముడువలస ఎంపీపీ పాఠశాల ఆవరణలో రూ.7.50లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఈ భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. భవన నిర్మాణాన్ని పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఈ రెండు భవన నిర్మాణాలపై ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మిని వివరణ కోరగా.. త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జగన్నాథపురంలో ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం



రాముడువలసలో చివరి దశలో ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణం

నేరాలు.. ఘోరాలు!

(ఐదో పేజీ తరువాయి)

ఆత్మనూన్యతా భావాలతో ఇటువంటి ఘటనలకు దిగుతున్నారు.

మత్తు పదార్థాలు కారణం..

మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన ఎక్కువ మంది విద్యార్థులు, యువత పడుతున్నారు. ప్రేమ దక్కలేదని, ప్రేమించిన యువతి దక్కలేదని భావించేవారు క్షణికావేశానికి లోనవుతున్నారు. మరికొందరు ఇదే మత్తుల్లో నేర ప్రవృత్తిని అలవాటు చేసుకుంటున్నారు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నాల్లో ఉన్న వారు సైతం నేరాల విషయంలో లెక్క చేయడం లేదు. ఇలా నేరాలకు ఎక్కువగా పాల్పడుతున్న వారిలో బాలురు, విద్యార్థులు, 30 సంవత్సరాల్లోపు వయసున్న వారు ఉండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఒకటి చేతిలో సెల్‌ఫోన్, మరొకటి మత్తు పదార్థాలే కారణమని పోలీసులు సైతం చెబుతున్నారు. అటు పోలీస్ శాఖ పరంగా కూడా అవగాహన కార్యక్రమాలు పెరుగుతున్నా ఈ నేరాలు నియంత్రణకు నోచుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

మానసిక నిపుణులు ఏమంటున్నారంటే..

మానసిక ఒత్తిడిని గుర్తించి దానిని అధిగమించే విషయంలో అన్నివర్గాల వారిలో అవగాహన రావాలి. బాల్యం నుంచే ఆత్మవిశ్వాసం పెంపొందించాలి. మంచి నడత, నడక ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు చూసుకోవాలి. అటు తరగతి గదిలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు, ఇంటి వద్ద ఉన్నప్పుడు తల్లిదండ్రులు పిల్లల కదలికలను గమనించాలి. పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చినప్పుడు వారు దుర్వినియోగం చేస్తున్నారా.. సరైన స్థితిలో ఉపయోగించుకుంటున్నారా అన్నది గమనిస్తుండాలి. స్నేహితుల విషయంలో కూడా ఆరాతీస్తుండాలి. నేర సంస్కృతి, వ్యసనాలకు అలవాటుపడే వారికి పిల్లలను దూరంగా ఉంచడం చాలా మంచిది.

శాంతిభద్రతలపై దృష్టిపెట్టాం..

జిల్లాలో శాంతిభద్రతలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. వరుసగా ఈ ఘటనలు జరగడం దురదృష్టకరం. పోలీస్ శాఖపరంగా పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం. ప్రజల్లో కూడా చైతన్యం రావాలి. నేరాల నియంత్రణ అనేది ప్రజా సహకారంతోనే సాధ్యం. జిల్లాలో శనివారం నమోదైన రెండు ఘటనలకు సంబంధించి సీరియస్‌గా దర్యాప్తు జరుగుతోంది. దోషులను కఠినంగా శిక్షిస్తాం. నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుంటాం.

- ఎస్పీ వకుల్‌జిందాల్ విజయనగరం

దురదృష్టకరం..

నేరాల నియంత్రణపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. కఠిన చట్టాలను అమలు చేస్తోంది. అయినా సరే ఇటువంటి ఘటనలు జరగడం నిజంగా దురదృష్టకరం. ముఖ్యంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు, యువత విషయంలో కుటుంబసభ్యులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. నేర ప్రవృత్తి, మత్తు పదార్థాల వినియోగంతో కుటుంబాలు ఎలా విచ్ఛిన్నం అవుతున్నాయో.. మరింత అవగాహన పెంచేలా యంత్రాంగం కృషి చేయాలి.

- కొండపల్లి శ్రీనివాస్, మంత్రి